క్లుప్తంగా

కౌన్సిల్ అత్యవసర సమావేశం వాయిదా

పెడన: మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. గురువారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలోని మునిసిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన నిర్వహించడానికి సిద్ధమయ్యారు. మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలియజేయడంతో సమావేశానికి సిద్ధమైన కౌన్సిల్ సభ్యులందరూ మీటింగ్ హాలులోకి వచ్చి కూర్చొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగకుమారి సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి వచ్చినందున ఈ సమావేశాన్ని నిర్వహించడం లేదని స్పష్టం చేస్తూ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బి. జ్యోతీ, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, చంద్రబాబు, సతీష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు

బందరు ఆర్డీఓ స్వాతి

కోడూరు: తీరప్రాంత గ్రామాల నుంచి అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బందరు ఆర్డీఓ కే.స్వాతి హెచ్చరించారు. గురువారం కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీఆర్వోలకు సంబంధించిన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. కోడూరు మండలంలోని తీరప్రాంత భూముల నుంచి ఇతర ప్రాంతాలకు రాత్రి వేళల్లో మట్టి రవాణా జరుగుతుందని ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ శ్రీనునాయక్‌ను ఆదేశించారు. పిట్టల్లంక గ్రామంలో జరుగుతున్న రీసర్వేపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆర్ఐ సుభాషిణి పాల్గొన్నారు.

వేణుగోపాలుడి సేవలో..

హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారిని బందరు ఆర్డీఓ కె.స్వాతి గురువారం దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి, ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. మాఘమాసంలో ఆలయంలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ నెల 10 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ పండితులు ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ శ్రీనునాయక్, ఆర్ఐ సుభాషిణి ఆమె వెంట ఉన్నారు.

అధికారులకు మత్స్యకారుల కృతజ్ఞతలు

నాగాయలంక: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు కోలా నాంచారయ్య మృతదేహాన్ని వెలికితీయడంలో అధికారులు చేసిన కృషికి ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి కృతజ్ఞతలు తెలిపింది. ఈ నెల 19న మత్స్యకారుడు సముద్రంలో గల్లంతైన సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమై జిల్లా కలెక్టర్, కోస్ట్‌గార్డ్‌లకు వివరించి, గాలింపు చేపట్టేలా సత్వర చర్యలు చేపట్టిన మండల తహసీల్దార్ ఎం.హరనాథ్‌ను గురువారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఐ గణేష్, మత్స్య సంఘాల నాగాడి పోతురాజు పాల్గొన్నారు.

స్నానాల షెల్టర్ నిర్మాణానికి స్థలం చూపాలని వినతి

గూడూరు: మండలంలోని కప్పలదొడ్డి శ్మశాన వాటిక అంత్యక్రియలు నిర్వహించి స్నానాలు ఆచరించడానికి షెల్టర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని చూపాలని గ్రామస్తులు సర్పంచి యక్కల మాధవి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మిని కలిసిన గ్రామ ఉపసర్పంచి పెన్నేరు నాంచారయ్య, వార్డు సభ్యుడు యక్కల నాగరాజులు మాట్లాడుతూ అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశాన వాటికకు వచ్చే బంధువులు స్నానాలు ఆచరించడానికి వాసవి మహిళా మండలి అనే స్వచ్ఛంద సంస్థ వారు ముందుకు వచ్చారని వివరించారు. దీనికి అవసరమైన స్థలాన్ని చూపితే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వారు వివరించారు. గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి కూడా దాతలు ముందుకు వచ్చిన నేపథ్యంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని చూపించాలని వారు కోరారు.

పెరటి కోళ్లకు టీకాలు వేయించాలి

ఘంటసాల: పెరటికోళ్లకు కూడా టీకాలు వేయించాలని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో జరుగుతున్న పెరటి కోళ్ల పెంపకంపై నైపుణ్య శిక్షణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ కోళ్ల యాజమాన్యంలో భాగంగా బ్రూడింగ్ అనగా చిన్న పిల్లల దశ, గ్రోయర్ దశ (9వ వారం నుంచి 20 వారాల) వరకు, గుడ్లు పెట్టే దశ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వేసవి కాలంలో కోళ్ల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, గుడ్ల ఎంపిక, పిల్లల ఉత్పత్తి గురించి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి చెప్పగా, కోళ్లల్లో టీకాలు ఎలా వేయాలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ అవగాహన కల్పించి చేసి చూపించారు.

పశు వైద్యం మిథ్య!

- కృత్తివెన్ను మండలంలో అరకొరగా వైద్యం
- మండల కేంద్రంలోనే వైద్యుల కొరత
- శిథిల భవనంలోనే వైద్యశాల



శిథిలమైన భవనంలో కొనసాగుతున్న కృత్తివెన్ను పశువైద్యశాల

కృత్తివెన్ను: పల్లెసీమలు పచ్చగా ఉంటే ప్రపంచం సంతోషంగా ఉంటుందన్నది నానుడి మాత్రమే కాదు నిజం కూడా. అటువంటి పల్లెలకు పట్టు కొమ్మలైన పాడిపంట నేడు నేతిబీరలో నెయ్యి చందంగా తయారైంది. తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో పాడిరంగానికి కీలకమైన పశువైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. మండల కేంద్రంలోనే పశువైద్యశాలకు శాశ్వత భవనం లేకపోగా శిథిలావస్థలో ఉన్న సత్రంలో పశువైద్యశాలను నడుపుతున్నారు. పశువైద్యుని పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. మండలంలో పెద్ద సంఖ్యలో పాడి రైతులు ఉండగా పాలదిగుబడి కూడా అధికంగా ఉంది. పశువులకు నాణ్యమైన వైద్య సేవలు లేకపోవడంతో లక్షల విలువల కలిగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి.

అంతంతమాత్రంగానే..

కృత్తివెన్ను మండలంలో పాడిరంగం ఆశాజనకంగానే సాగుతోంది. ఇక్కడ 1,148 ఆవులు, 7,895 గేదెలు, 11,242 గొర్రెలు, మేకలు ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇంతటి పెద్ద సంఖ్యలో మూగ జీవాలున్న చోట మండలం మొత్తానికి కేవలం ఒక్కరే వైద్యుడు ఉండటంతో అత్యవసర సమయంలో సరైన వైద్య సేవల కోసం అందుబాటులో ఉన్నటువంటి చిన్నపాటి వైద్యం తెలిసిన వారినే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఇక్కడి రైతులకు ఎదురవుతోంది.

మండల కేంద్రంలోనే వైద్యం కరువు..

మండల కేంద్రమైన కృత్తివెన్నులో వైద్యుని పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. ఇక్కడ కనీసం వైద్యశాల కూడా లేకపోవడం గమనార్హం. శిథిలావస్థకు చేరిన బాటసార సత్రంలోనే వైద్యశాలను కొనసాగిస్తున్నారు. చాలా ఏళ్లుగా ఇక్కడ ఈ పోస్టు భర్తీ చేయడం లేదు. వారానికి రెండు రోజులు నీలిపూడిలో పనిచేసే వైద్యులు ఇక్కడికి వచ్చి పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఇక్కడి పశువైద్యశాలలో పశువులను పరీక్షించేందుకు అవసరమైన ట్రెవీస్ కూడా లేకపోవడం విశేషం. మండలంలోని నీలిపూడిలో వైద్యులు ఉండగా, అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. చినగొల్లపాలెం సబ్‌సెంటర్ (రూరల్ లైవ్ స్టాక్ పాయింట్) నందు జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపి మండల కేంద్రంలో వైద్యుడి నియామకంతోపాటు నీలిపూడిలో అటెండర్‌ను నియమించాలని పాడిరైతులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో పశువైద్యులు ఉండాలి..



మా ప్రాంతంలో అధికశాతం మంది పాడిరంగాన్నే నమ్ముకుని ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో పశువైద్యుల కొరత లేకుండా ఉంటే ఏదైనా అత్యవసరమైనప్పుడు నాణ్యమైన పశువైద్యం లభిస్తుంది.

– పిన్నెంటి నరసింహారావు, రైతు, గాంధీనగరం

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



సాధ్యమైనంత మేర పశువులకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. ఏదైనా అత్యవసరం అయితే వెంటనే వెళ్లి వైద్యసహాయం చేస్తున్నాం. వారంలో రెండు రోజులు కృత్తివెన్నులో వైద్యపరీక్షలు చేస్తున్నాం. పాడిరైతులకు ఇబ్బంది లేకుండా వైద్యశిబిరాలు సైతం నిర్వహిస్తున్నాం.

– సుకాంత్, పశువైద్యుడు, నీలిపూడి

దేశ సమైక్యత కోసం యువత పాటుపడాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని యువత దేశ సమైక్యత కోసం పాటుపడాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ కోరారు. చల్లపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో గాంధీ స్మృతి వనం వద్ద గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు. అవనిగడ్డలోని గాంధీ క్షేత్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు



మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న చిట్టిపాలెం గ్రామస్తులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మద్ది చిన్నా, గాజుల జైగోపాల్, సింహాద్రి రామనాధం,చింతలపూడి బాలు, తన్నీరు వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

నాగాయలంక: మండల ఆర్యవైశ్యసంఘం, జై వాసవీ సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం, వాసవీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యుడు చిట్టా అన్నపూర్ణయ్య, సంఘ కార్యకర్త తూనుగుంట్ల రామకృష్ణ తొలుత మహాత్మాగాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, దేసు సత్యనారాయణ, చిట్టా వెంకట శేఖర్, ఆర్యవైశ్య సంఘం, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో..

పెడన: జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లూరి చిన్నా, దేసు శ్రీనివాస్ స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు చిట్టూరి పశుపతినాథ్ బాబు, కార్యదర్శి జవాజి నాగు, సభ్యులు కొల్లూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో..

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం వద్ద మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త విస్సంశెట్టి రాజా, మాజీ ఎంపీటీసీ గోరిపర్తి శ్రీనివాసరావు, గద్దె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని త్యాగం మరువలేనిది

కోనేరుసెంటర్: దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగం మరువలేనిదని అరిశేపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నరిశెట్టి రత్తయ్య అన్నారు. జాతిపిత మహాత్మగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన గ్రామస్తులతో కలిసి నివాళులు అర్పించారు.

గూడూరులో..

గూడూరు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గూడూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆకులమన్నాడు గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచి మహమ్మద్ రఫీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వీఆర్వో వరప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లల బియ్యం పక్కదారి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

కోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన పీడీఎస్ బియ్యాన్ని రేషన్ డీలర్, కుక్కింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పక్కదారి పట్టిస్తున్న ఘటన కోడూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రేషన్ బియ్యం పక్కదారి పడుతుందనే సమాచారంతో ఎస్ఐ చాణిక్య సిబ్బంది కలిసి ఉల్లిపాలెం వారధి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. మద్దంశెట్టి దుర్గాప్రసాద్, కరణం శ్రీనివాస్, యడపల్లి శ్రీనులు ఆటోలో బియ్యాన్ని తరలించడాన్ని గమనించి సీజ్ చేశారు. 18 సంచుల్లో సుమారు 900 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం మండలంలోని స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించినవిగా గుర్తించామని, ఈ అక్రమ రవాణాలో డీలర్ విమలాదేవి, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు వెంకటనారాయణ పాత్ర ఉన్నట్లు తమ విచారణలో తేలిందని ఎస్ఐ చెప్పారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): స్థానిక పంచాయతీ పరిధిలో బ్రహ్మానందపురం ఎస్సీ కాలనీలోని చర్చి ఆధ్వర్యంలో గురువారం వార్షిక జనవరి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. నూతన సంవత్సర వేడుకను జనవరి 31లోపు ఏదో ఒకరోజు గ్రామస్తులు సమష్టిగా జెండా పండుగలా ఈ కార్యక్రమం చేస్తామని నిర్వాహక ప్రతినిధులు తానంకి చంటి, పోతురాజు చెప్పారు. వేడుకలో ప్రధానంగా రెండు వేలమందికి అన్న సంతర్పణ జరిపారు.

జనవరి పండుగకు సిద్ధం..

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామంలోని ఆర్సీఎం చర్చి వార్షికోత్సవం సందర్భంగా జరిగే జనవరి పండుగకు విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు. శనివారం చర్చిలో ఫాదర్ పులిపాక జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

టీజీఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

శ్రీకాకుళం(ఘంటసాల): పేదల కన్నీరు తుడిచే టీజీఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో టీజీఆర్ చారిటబుల్ ట్రస్టు తరపున 200 మంది నిరుపేదల కుటుంబాల వారికి రూ.3వేల విలువైన బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. బేతేల్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ చలపాటి ఏలీషా బాబు, గ్రామ సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) తదితరులు పాల్గొన్నారు.

200 కుటుంబాలకు బియ్యం, సరుకులు అందజేత

పులిగడ్డ(అవనిగడ్డ): విజయవాడకు చెందిన టీడీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మల సత్యం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పులిగడ్డలో 200 మందికి బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ద్వారా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి నున్న శ్యాం కుమార్, సీహెచ్ ఇస్మాయేల్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మండలి దినేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వేములపల్లి(ఘంటసాల): మండలంలోని కొడాలి-వేములపల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. చల్లపల్లి మండలం యార్లగడ్డ గ్రామానికి సీహెచ్ లక్ష్మయ్య ద్విచక్ర వాహనంపై చల్లపల్లి వైపు నుంచి మొవ్వ వైపు వస్తుండగా మొవ్వ నుంచి నాగాయలంక ధాన్యం లోడుతో వెళ్తోంది. కొడాలి-వేములపల్లి మధ్య గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెన వద్ద ట్రాక్టర్‌లోని ధాన్యం బస్తాలు తగలడంతో లక్ష్మయ్య పడిపోయాడు. లక్ష్మయ్య కుడికాలు విరగడంతో పాటు తలకు దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. లక్ష్మయ్యను చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మచిలీపట్నం తరలించారు.

జేఈఈ మెయిన్స్‌కు 132 మంది హాజరు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జేఈఈ మెయిన్స్ సెంటర్‌లో గురువారం 132 మంది పరీక్షకు హాజరయ్యారని కేంద్రం అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 132 మంది హాజరవ్వగా 48 మంది హాజరు కాలేదన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు.

చంద్రబాబు నమ్మించి మరోసారి ముంచారు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: చంద్రబాబుకు నమ్మించి మోసం చేయడం అలవాటేనని, అమలు కాని హామీలిచ్చి మరోసారి ముంచారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపద సృష్టించి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వాటికి డబ్బులు లేవని చెప్పడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలకు ఈ విషయం తెలియలేదా అని ఎద్దేవా చేశారు. కోవిడ్ సమయంలో కూడా ఏ ఒక్క పథకం ఆపకుండా ఐదేళ్లు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఏడు నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కూటమి నాయకులకు ఏ నొప్పి వచ్చినా అందుకు జగన్‌మోహన్‌రెడ్డి కారణం అంటున్నారని సింహాద్రి అన్నారు. పవన్‌కల్యాణ్‌తో చెడ్డపనులు చేయించి జనసేన పార్టీని అల్లరి చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో మండలి బుద్ధప్రసాద్ జన సైనికులను రెచ్చగొట్టి తన కార్యాలయం మీదికి ఉసిగొల్పింది నిజం కాదా అని సింహాద్రి ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుమ, మట్టి మాఫియా పెట్రేగి పోతోందని.. నీకెంత, నాకెంత అనే ధోరణిలో దోసుకుంటున్నారని సింహాద్రి విమర్శించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ గోపాలరావు, టీపీవో సుజనాకుమారి

పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిచి పోలింగ్ కేంద్రాన్ని గురువారం మునిసిపల్ అధికారులు పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు, టీపీవో బి. సుజనాకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి. జితేంద్ర, ప్లానింగ్ కార్యదర్శులున్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

నాగాయలంక: మండలంలో 29వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ గురువారం తెలిపారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదల అయిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. మండల అధికారులు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల ఉద్యోగులు కోడ్ అమలునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, అప్పటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ వివరించారు.

విగ్రహాలకు ముసుగులు..

కోడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల్లో భాగంగా మండలంలోని 13 పంచాయతీల్లో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పార్టీల ఫ్లెక్సీలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కోడ్ నిబంధనలను రాజకీయ నేతలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ స్పష్టం చేశారు. ఫ్లెక్సీల తొలగింపును ఎంపీడీఓ సుధాప్రవీణ్, కార్యదర్శులు పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన..

అవనిగడ్డ: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియాదేవి, ఎస్ఐ శ్రీనివాస్ స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ని గురువారం పరిశీలించారు. అనంతరం కార్యదర్శులు, వీఆర్వోలతో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఘంటసాలలో..

ఘంటసాల: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఘంటసాల మండలంలో పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఘంటసాల జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, ఎస్ఐ కె.ప్రదీప్‌రెడ్డి సంయుక్తంగా గురువారం పరిశీలించారు.

మినుములో పొగాకు లద్దెపురుగు ఉధృతి



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

కప్తానుపాలెం(మోపిదేవి): మినుము సాగులో పొగాకు లద్దెపురుగు ఉధృతిని గుర్తించినట్లు కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డి. సుధారాణి, సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని పెదప్రోలు శివారు కప్తానుపాలెంలో మినుము సాగులను క్షేత్రస్థాయిలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మినుములో పొగాకు లద్దెపురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. దీని నివారణకు వేప సంబంధిత మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. తద్వారా తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా, పెట్టిన గుడ్లు పొదగకుండా పిల్ల పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని చెప్పారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు క్లోరాంట్రనిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని వివరించారు. బూడిద తెగులు నివారణకి హెక్సకొనోజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పాడి పశువులను పరీక్షిస్తున్న ఏడీ బాబూరావు

పెడన: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొనకళ్ల బాబూరావు అన్నారు. గురువారం పట్టణంతో పాటు మండలంలోని నందిగామ, కూడూరు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పశువులకు సాధారణ కేసులు 385, గర్భకోశ వ్యాధులున్న పాడి పశువులు 115, 334 గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందును వేశామని, కొన్నింటికి ఉచితంగా మందులను అందజేశామని ఏడీ తెలిపారు. మండల పశువైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్, జేఈవో సూరిబాబు, వీఏ రాజేశ్వరరావు, వీఎల్‌వో వెంకటేశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

దేవరకోటలో పశు వైద్య శిబిరం

దేవరకోట(ఘంటసాల): మండలంలోని దేవరకోటలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, మండల పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశు ఆరోగ్య ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి ప్రారంభించగా మండల పశువైద్యధికారి పిన్నమనేని మనోజ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

పరస్పర దాడులపై కేసుల నమోదు

గూడూరు: రెండు వర్గాలు గురువారం పరస్పర దాడులకు దిగడంతో గూడూరు పోలీస్ స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదు అయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నారికేడాలపాలెంలోని జనసేన నాయకుడు కనపర్తి వెంకటేశ్వరరావు ఇంట్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బత్తిన హరిరామ్ ఉండగా.. అదే సమయంలో పి.రామకృష్ణ, అనిల్ కుమార్, బి.అనీల్, మహేష్ అనే వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దౌర్జన్యం చేశారు. ఆ సమయంలో అడ్డు వచ్చిన తనను తోసివేశారంటూ కనపర్తి వెంకటేశ్వరరావు భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఆ ఇంటికి సమీపంలోని పెట్రోలు బంకు దగ్గర ఉన్న తమపై వెంకటేశ్వరరావు, హరిరామ్ అనుచరులతో వచ్చి దాడికి పాల్పడగా తన తలకు గాయమై రక్తస్రావమైనట్లు బలరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు.

ట్రాక్టర్‌పై వరిగడ్డి దగ్ధం

మర్రిపాలెం(నాగాయలంక): నాగాయలంక పక్కనున్న మర్రిపాలెం వంతెనపై వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రక్టర్‌లో మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా మంటలు పైకి చెలరేగడంతో ఆ ప్రాంతంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన డ్రైవర్ యాసం రామకోటేశ్వరరావు ట్రాక్టర్‌లో మండలంలోని కమ్మనమోలు ప్రాంతంలో పశుగ్రాసం కోసం వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న సమయంలో మర్రిపాలెం వద్ద ఈ దుర్ఘటన జరిగింది. గ్రామస్తులు అవనిగడ్డ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వచ్చిన సిబ్బంది మంటలను అదుపులోనికి తెచ్చారు. వంతెన మలుపు వద్ద ఎదురుగా చిన్నపిల్లలు రావడంతో వారి మీదకు వెళ్లకుండా ట్రాక్టర్‌ను తప్పించబోయే ప్రయత్నంలో విద్యుత్ తీగలు తగులుకోవడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ తెలిపాడు. పోలీసులు సమాచారం సేకరించారు గానీ కేసు నమోదు చేయలేదు.